

గురుకులంలో ఆంగ్లం బోధించేందుకు
దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ శివార్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో స్కూల్, కళాశాలస్థాయిలో ఆంగ్లంలో బోధించడానికి పోస్టులు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ లింగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు తమ సర్టిఫికెట్లతో నేడు కళాశాలలో డెమోకు హాజరు కావాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జిల్లా సమస్యలపైనే
సంగారెడ్డి కలెక్టర్‌ను కలిశా

● మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశానని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యంతో కలిసి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలవేసి, అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రారంభించిన సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కొనసాగించాలని, జిల్లాకు గోదావరి జలాలను తరలించాలని కోరారు. రూ.2లక్షలలోపు రుణమాఫీ కానివారు ఇంకా చాలామంది రైతులు ఉన్నారని, వారందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో 1,073 చెరువులు, కుంటలు ఉండగా.. ఈ సంవత్సరం కేవలం 79 చెరువుల్లోనే చేప పిల్లలు వదిలారని, మిగిలిన చెరువులు నిండలేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు.

సంగారెడ్డి నియోజకవర్గంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ముదిరాజ్, లింగాయత్, గౌడ, పద్మశాలీల భవనాల నిర్మాణాలకు ఎకరం చొప్పున భూమిని, రూ.25 లక్షల చొప్పున నిధులను మంజూరు చేశామని, ఆ పనులను ప్రారంభించాలని కోరారు. సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాలకు ఎస్‌డీఎఫ్, ఎంఆర్‌సీ పనులను రద్దు చేయడం బాధకరమన్నారు. సంగారెడ్డి, సదాశివపేట మునిసిపాలిటీల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణాలను నిలిపివేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ అవసరాల కోసం కంది, ఫసల్‌వాది, మామిడిపల్లి, చేర్యాల, ఆరుట్ల, బ్యాతోలు తదితర గ్రామాల్లో భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఫసల్‌వాది గ్రామ శివారులో రిటైర్డు పోలీసు అధికారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను స్వాధీనం చేయాలని కోరారు. ఆయా విషయాలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జి.శ్రీహరి, వరలక్ష్మి, ఆర్.వెంకటేశ్వర్లు, మనోహర్‌గౌడ్, కొండల్‌రెడ్డి, విష్ణు, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వచ్చారా?

పీహెచ్‌సీల్లో ఇష్టారాజ్యం

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- ఫోన్ చేసి వస్తున్న రోగులు
- పలు సెంటర్లలో మందుల కొరత
- మొక్కుబడి తనిఖీలు
- అస్తవ్యస్తంగా నిర్వహణ

'కల్హేర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 10 మంది వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉంటున్నారు. ఉదయం 9గంటలకే రావాల్సిన వైద్యుడు బుధవారం 10.40 గంటలకు చేరుకున్నారు. వంతులవారీగా విధులు నిర్వహిస్తున్నారని, వైద్యసేవలు సరిగా అందడం లేదని ఆసుపత్రిపై పలు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ చర్యలు చేపట్టాల్సిన అధికారులు మెమోలతో సరిపెట్టి మమ అనిపించారు'

'అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని లింగమయ్య కాలనీలో గల బస్తీ దవాఖానాలో వైద్య సేవలు సరిగా అందడం లేదు. ఇక్కడ కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన డాక్టర్ వాణికి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో పోస్టు ఖాళీ అయ్యింది. కనీసం ఇక్కడ డిప్యూటేషన్‌పైనా నియామకం చేపట్టలేదు. దీంతో రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తున్నది.'

సంగారెడ్డి జిల్లాలో మారుమూల ప్రాంతమైన కల్హేర్, నగర సరిహద్దులోని అమీన్‌పూర్‌లో అందుతున్న ప్రభుత్వ వైద్య సేవల పరిస్థితికి ఈ వివరాలు అద్దం పడుతున్నాయి. ఈ రెండు ఆసుపత్రుల్లోనే కాదు. జిల్లాలో గల పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్వహణపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. బుధవారం రోజున 'ఆంధ్రజ్యోతి' బృందం సంగారెడ్డి జిల్లాలోని పలు పీహెచ్‌సీలను విజిట్ చేయగా లోటుపాట్లు తేటతెల్లమయ్యాయి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి



సంగారెడ్డి రిక్షాకాలనీ బస్తీ దవాఖానాలో 9 గంటలకు ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

ఆంధ్రజ్యోతి విజిట్

ఉదయం 9 గంటలకు తెరుచుకోవాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొన్ని దారి తప్పుతున్నాయి. ఆలస్యంగా తెరుచుకుంటున్నాయి. ముఖ్యంగా నారాయణఖేడ్ డివిజన్‌లో వైద్యసేవలను నిర్లక్ష్యం చేస్తున్నట్టు తెలుస్తున్నది. మారుమూల ప్రాంతం కావడంతో ఉన్నతాధికారులు పట్టించుకోక సిబ్బంది ఇష్టారాజ్యంగా మారింది. ఆదర్శంగా ఉండాల్సిన వైద్యాధికారులే సరైన సమయపాలన పాటించడం లేదనే విమర్శలున్నాయి. గతంలోనూ రుజువయ్యాయి. అత్యవసర విభాగమైన వైద్యవృత్తిలో ఉంటూ ఆలస్యంగా వస్తున్నవారు కూడా ఎంతో మంది ఉన్నారు. పలు పీహెచ్‌సీలలో వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియక అంతసేపు వేచిచూడలేని రోగులు సిబ్బందికి ఫోన్‌చేసి డాక్టర్ వచ్చారా అని ఆరాతీసి.. వచ్చారని చెప్తేనే దవాఖానకు వెళ్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వైద్యసేవలపై విమర్శలు

● కంగ్టిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యురాలు నాగమణి, స్టాఫ్‌నర్సులు సమయానికి వచ్చారు. ఫార్మాసిస్టు సరిగ్గా 12గంటలకు ఆసుపత్రికి చేరుకోగా ఇద్దరు సూపర్‌వైజర్లు మాత్రం సెలవు పత్రాలు ఇవ్వకుండానే విధులకు గైర్హాజరయ్యారు.

● సిర్గాపూర్‌లో సిబ్బంది, వైద్యులు ఉదయం సమయానికే వస్తున్నప్పటికీ మధ్యాహ్నం తర్వాత సిబ్బంది ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి గాయానికి స్వీపర్ కట్టు కట్టిన విషయం వెలుగులోకి వచ్చింది.

● తెల్లాపూర్‌లోని పాత మున్సిపల్ భవనంలో ఆసుపత్రిని ప్రారంభిస్తామని రెండు నెలల క్రితం మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. కానీ ఏర్పాటు చేయకపోగా మహిళా భవనంలో ఉన్న బస్తీ దవాఖానా కూడా మూతపడింది.

● సంగారెడ్డి బస్తీ దవాఖానలో ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యుడు 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు.

● మునిపల్లి పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్ నెలరోజులుగా సెలవులో ఉన్నందున వైద్యపరీక్షల కోసం రోగులు ఇబ్బంది పడుతున్నారు.

● వట్‌పల్లి పల్లె దవాఖానాలో షుగర్, బీపీ టాబ్లెట్ల కొరత ఉంది.

సిబ్బంది, మందుల కొరత

జిల్లాలోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలలో సిబ్బంది కొరత కనిపిస్తోంది. ప్రతీ పీహెచ్‌సీ, బస్తీ దవాఖానాలో ఒక వైద్యాధికారి తప్పనిసరిగా ఉండాలి. స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్లు అవసరం. కానీ చాలాచోట్ల అవసరమైనంత సిబ్బంది లేరు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను సైతం భర్తీ చేయడం లేదు. ఇక బీపీ, షుగర్ టాబ్లెట్లతోపాటు డైక్లోఫినాక్‌ఇంజక్షన్లు, లివోసిట్రిజన్ టాబ్లెట్లు కూడా సరిపడా లేవని పలుచోట్ల వైద్య సిబ్బంది చెబుతున్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇదే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రి దృష్టికి తీసుకెళ్తే వైద్య పరంగా ఎలాంటి లోటుపాట్లు ఉండబోవని, మరింత మెరుగైన సేవలను జిల్లా ప్రజలకు అందించవచ్చనే అభిప్రాయాలు నెలకొన్నాయి.

సంగారెడ్డి జిల్లాకు మూడు కొత్త పీహెచ్‌సీలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో మరో మూడు కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు అయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్, ఝరాసంగం మండలం బర్దీపూర్, అందోల్ మండలం నేరేడిగుంట గ్రామాల్లో పీహెచ్‌హెచ్‌లు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. కాగా గత నెలలో రాయికోడ్ మండలం సింగీత, మునిపల్లి మండలం కంకోల్ గ్రామాల్లో పీహెచ్‌సీలు మంజూరైన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలో కొత్తగా ఐదు పీహెచ్‌సీలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. అలాగే, మూసాయిపేటకు త్వరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కానుందని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడుతాయని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



తెల్లాపూర్‌లో మూతబడిన బస్తీ దవాఖానా



కల్హేర్ హెల్త్‌సెంటర్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

గ్రంథాలయానికి మంచిరోజులు

● నర్సాపూర్ లైబ్రరీలో వసతులపై దృష్టి ● నూతన కుర్చీలు, బెంచీల ఏర్పాటు



నర్సాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని గ్రంథాలయానికి మంచి రోజులు వచ్చాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి చొరవతో కుర్చీలు, బెంచీలు, ర్యాకులు మంజూరు చేయించారు. 80 కుర్చీలు, 20 టేబుళ్లు, 20 ర్యాకులు వచ్చాయి. త్వరలోనే అన్ని సౌకర్యాలను కల్పిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. నియోజకవర్గ కేంద్రంలో గ్రంథాలయం అద్దెభవనంలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగించేవారు. గత ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయడంతో నూతన భవనాన్ని నిర్మించగా.. ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హడావుడిగా ప్రారంభించారు. భవనం సమకూరినా కూర్చోవడానికి, చదువుకోవడానికి సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. కనీసం పుస్తకాలు పెట్టడానికి ర్యాకులు కూడా లేకపోవడంతో 14 వేల పుస్తకాలు సంచుల్లో మూలిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నియోజకవర్గ నేత సుహాసినిరెడ్డి వసతులు సమకూర్చేందుకు పూనుకున్నారు. టేబుళ్లు, కుర్చీలు, ర్యాకులు రాగా, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరముంది. కాగా, బుధవారం గ్రంథాలయాన్ని సందర్శించిన సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నర్సాపూర్ లైబ్రరీలో అన్ని సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. మెదక్ జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ నాలుగు మండలాల్లో కూడా త్వరలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చదువంటేే ఇష్టం.. బతుకేమో భారం



నారాయణఖేడ్‌లో కూరగాయలను విక్రయిస్తున్న నిర్మల

కుటుంబపోషణకు కూరగాయలు అమ్ముతున్న ఇంటర్ విద్యార్థి
ఎంబీబీఎస్ లక్ష్యంగా కష్టపడుతున్న గిరిపుత్రిక

7

రోడ్లు ఇలా.. పల్లెకు చేరేదెలా?

జహీరాబాద్ నియోజకవర్గంలో అధ్వానంగా గ్రామీణ రహదారులు
సమీప గ్రామాలకు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే
ప్రజలకు దూరాభారం
విన్నవించినా పట్టించుకోని అధికారులు, నేతలు

8



రేజింతల్-హద్నూర్ రోడ్డు దుస్థితి



నారాయణఖేడ్‌లో పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించాలి

● సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

నారాయణఖేడ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 14న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో నారాయణఖేడ్ సబ్‌డివిజన్ పరిధిలో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేలా చూడాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. డివిజన్‌లోని ఎస్‌హెచ్‌వోలతో బుధవారం ఆయన నారాయణఖేడ్ పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే జిల్లా నార్కోటిక్ అనాలసిస్ బ్రాంచ్ నంబరు 8712656777కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు. ట్రైనీ ఎస్‌ఐలతో మాట్లాడి పలు విషయాలపై సూచనలు చేశారు. నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు, ట్రైనీ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు పటిష్ట బందోబస్తు

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

మెదక్ అర్బన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 15, 16వ తేదీల్లో జరగనున్న గ్రూప్-2 పరీక్షకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బయోమెట్రిక్ నమోదుపై ఇన్విజిలేటర్లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 16 పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిబంధనలు అమలులో ఉంటాయని, అక్కడ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించే మోగాళ్లను నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, అదనపు ఎస్పీ మహేందర్, రీజినల్ కోఆర్డినేటర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్, ఛీఫ్ సూపరిండెంట్లు, అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

● లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఈ నెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

మూడున్నర ఏళ్ల బాలికపై లైంగిక దాడి?

మెదక్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలో మూడున్నర ఏళ్ల బాలికపై ఓ ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డ ఘటన బుధవారం వెలుగు చూసింది. పట్టణ శివార్లలోని పిల్లికోటాల్ డబుల్‌బెడ్‌రూం కాలనీలో నివాసముండే ఆటోడ్రైవర్ అజంపురా వీధిలో ఓ ఇంట్లో మూడున్నర సంవత్సరాల వయస్సు గల చిన్నారికి చాక్లెట్లు ఇచ్చి లైంగికదాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆటోడ్రైవర్ బంధువులు అజంపురాలోనే ఉండడంతో తరచూ వారి ఇంటికి వచ్చేవాడని, ఈ క్రమంలో బాలికను మచ్చిక చేసుకుని లైంగికదాడి చేసినట్లు సమాచారం. అయితే, విషయం బయటికి పొక్కడంతో పోలీసులు బాలికను భరోసా సెంటర్‌కు తరలించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు
- పుల్‌కల్‌లో సర్వీస్ రోడ్డుపై ట్రాక్టర్ ఢీకొని వెల్డర్
- నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొనడంతో ఇద్దరు
- గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు
- అదుపు తప్పి బైక్ కిందపడడంతో యువకుడు

7

రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు సూర్యతేజ్



సిద్దిపేట రూరల్,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు మోడల్ స్కూల్ విద్యార్థి సూర్యతేజ్ ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్ కొడకండ్లలో జిల్లా మ్యాథ్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో సూర్యతేజ ద్వితీయ విజేతగా నిలిచాడన్నారు. ఈ సందర్భంగా సూర్యతేజను ప్రిన్సిపాల్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, చంద్రారెడ్డి, అనిత, సుహాసిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



అహ్మదీపూర్ గ్రామానికి వెళ్లే దారిలో వరిధాన్యం

రోడ్లపైనే ధాన్యం

కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నా.. ఇంకా రోడ్లపైనే ధాన్యం ఆరబెడుతున్నారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గజ్వేల్ మండల కేంద్రంలోని అహ్మదీపూర్, సింగాటం, శేరిపల్లి గ్రామాల్లో కొందరు రైతులు రోడ్డుకు సగం వరకు ధాన్యం ఆరబెట్టారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గజ్వేల్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి)



సింగాటం వెళ్లే దారిలో...

తూతూ మంత్రంగా సీఎం కప్ క్రీడలు

దుబ్బాక, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలంలో సీఎం కప్ క్రీడలను అధికారులు తూతూ మంత్రంగానే నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో యువతకు, యువజన సంఘాలకు సమాచారం ఇవ్వకుండానే క్రీడలను ప్రారంభించారు. బుధవారం ఉదయం ప్రారంభమై, సాయంత్రానికి ముగించారు. బుధవారం నిర్వహించిన క్రీడల్లో మున్సిపాలిటీ నుంచి 7 టీంలు, గ్రామీణ ప్రాంతాల నుంచి 13 టీంలు పాల్గొన్నాయి.అందులో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో మాత్రమే నిర్వహించారు. ఇందులో 18 ఏండ్లు దాటిన వారు వాలీబాల్ టీంలో 7 టీంలు పాల్గొన్నాయి. కబడ్డీలో 15 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వరకు వయస్సు ఉన్న 13 టీంలు పాల్గొన్నాయి. ఖోఖోకు రెండు టీంలు మాత్రమే వచ్చాయి. క్రీడలకు యువతను, క్రీడాకారులను ఆహ్వానించే బాధ్యతను గ్రామస్థాయిలో గ్రామ కార్యదర్శులకు అప్పగించగా, వారు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో బిజీగా ఉండటంతో యువతకు సమాచారం ఇవ్వలేకపోయారని తెలుస్తోంది. మరో పక్క పనిభారం కారణంగా అధికారులూ క్రీడలపై పెద్దగా శ్రద్ధ చూపలేదని తెలుస్తోంది. మండలంలో బుధవారం జరిగిన సీఎం కప్ క్రీడల కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి, సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ బాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట కబడ్డీ పోటీలో వాగ్వాదానికి దిగిన క్రీడాకారులు

సీఎం కప్ క్రీడల్లో ఉద్రిక్తత

చిన్నశంకరంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ కారణంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంబాజీపేట, జంగరాయి తండ క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో తలపడగా, పాయింట్ల విషయంలో వివాదం చెలరేగి, ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇరు జట్లను సముదాయించారు. ఈ పోటీని హోల్డ్‌లో పెట్టి.. చందంపేట-శాలిపేట టీంల మధ్య పోటీ నిర్వహించారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

టేక్మాల్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాదులూరు గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు పూర్తి ఏర్పాట్లు చేశారు. జాతరలో భాగంగా భక్తులు బోనాలను ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ యాదయ్య ముదిరాజ్, సంఘం అధ్యక్షుడు రాజేందర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

వీరభద్ర ప్రసన్న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

వట్‌పల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మరవెల్లి గ్రామంలో శ్రీ వీరభద్రేశ్వర ప్రసన్న ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, వీరశైవ లింగాయత్‌లు, ఆర్యవైశ్యులు, విశ్వ బ్రాహ్మణులు, గ్రామస్థులు ఆలయ నిర్మాణం కోసం చందాలు వేసుకుని పనులు చేపడుతున్నారు. ఈ పనులకు శ్రీ జ్యోతిర్వస్తు విద్యాపీఠాధిపతి డాక్టర్ శ్రీమహేశ్వర శర్మ సిద్ధాంతి శంకుస్థాపన చేశారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీఠాధిపతి



14న దత్తజయంతి

మెదక్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన ఏకముఖ దత్తాత్రేయ స్వామి ఆలయం వేడుకలకు సిద్ధమైంది. 400 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో గురువారం నుంచి 14వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దేశాయిపేట పాండురంగ శర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14న స్వామి వారి జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆరో రోజుకు సమ్మె

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్ చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత, రాణి, రజిత, భానుశ్రీ, సుజాత, కవిత, విష్ణు, నరేశ్ పాల్గొన్నారు.

మెదక్‌లో టీ కప్పులతో నిరసన

మెదక్ అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమను క్రమబద్దీకరించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజుకు చేరింది. బుధవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గతేడాది దీక్ష శిబిరానికి వచ్చిన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చాయ్ తాగినంత సేపట్లో మీ సమస్యను పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. దానిని గుర్తు చేస్తూ.. టీ కప్పులతో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజు, కార్యదర్శి పాషా, రాజశేఖర్, సంపత్, కనకరాజు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్త!

● మీ పెట్స్ వీధిలో టాయిలెట్ చేస్తే జరిమానా

● యజమానే శుభ్రం చేయాలి

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా పెంపుడు కుక్కతో బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయిస్తున్నారా.. అయితే జాగ్రత్త ! అలా చేస్తే మున్సిపాలిటీకి జరిమానా చెల్లించాల్సిందే. మున్సిపల్ చట్టంలో ఉన్న ఈ నిబంధనను అన్ని బల్దియాల్లో అమలు కానున్నది. ఈ మేరకు మున్సిపల్ శాఖ కమిషనర్ టికె శ్రీదేవి నుంచి అన్ని మున్సిపాలిటీల కమిషనర్లకు ఇటీవలే ఆదేశాలు జారీ అయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 61,622 వీధి కుక్కలు ఉండగా, దాదాపు 1521 పెంపుడు కుక్కలు ఉన్నట్టు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. జిల్లాలో ఎనిమిది మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి మున్సిపాలిటీలో రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తుంది. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం మధ్య వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ.. అక్కడే మల, మూత్ర విసర్జన చేస్తుంటాయి. దీన్ని అరికట్టలేక మున్సిపాలిటీల సిబ్బంది సతమతమవుతున్నారు. దీనికి తోడు పెంపుడు కుక్కల యజమానులు తమ శునకాలను వాకింగ్ చేయిస్తూ బహిరంగ ప్రదేశాల్లోనే మల,మూత్ర విసర్జన చేయిస్తుండటం సాధారణంగా మారిపోయింది. ఇలా చేయిస్తే యజమానే దాన్ని శుభ్రం చేయాల్సి ఉంటుంది. అంతేగాక యజమాని రూ.వేయి నుంచి అంతకంటే ఎక్కువే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.



చట్టాన్ని కఠినంగా అమలు చేస్తాం

పారిశుధ్యం పరిరక్షణను ప్రతీ ఒక్కరు బాధ్యతగా గుర్తించాలి. బహిరంగ ప్రదేశాల్లో పెంపుడు కుక్కలు మలమూత్ర విసర్జన చేస్తే సంబంధిత యజమానులకు జరిమానాలు విధిస్తాం. చట్టం కఠినంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఈ విషయంలో పెంపుడు కుక్కల యజమానులు కూడా అవగాహన కలిగి ఉండాలి. ఎవరైనా పెంపుడు కుక్కలను వీధుల్లో మల విసర్జన చేయిస్తే యజమానితోనే శుభ్రం చేయిస్తారు. లేదా యజమానికి జరిమానా వేస్తారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పట్టణాల్లో పరిశుభ్రత సాధ్యమవుతుంది.

- మనోజ్, శిక్షణా కలెక్టర్, సంగారెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు
- పుల్‌కల్‌లో సర్వీస్ రోడ్డుపై ట్రాక్టర్ ఢీకొని వెల్డర్
- నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొనడంతో ఇద్దరు
- గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు
- అదుపు తప్పి బైక్ కిందపడడంతో యువకుడు మృతి


మహమ్మద్ శాబొద్దీన్ మృతదేహం

పుల్‌కల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ సమీపంలోని సంగారెడ్డి - నాందేడ్ - అకోలా 161 జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట పట్టణంలోని సయాజీనగర్‌కు చెందిన మహమ్మద్ శాబొద్దీన్(39) చౌటకూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న దాబాలో వెల్డింగ్ పనులు చేసేందుకు వచ్చాడు. కటింగ్ బ్లేడ్ ఇతర పని ముట్లను కొనుగోలు చేసేందుకు బైక్‌పై చౌటకూర్ గ్రామానికి వెళ్తుండగా, హైవే సర్వీసు రోడ్డుపై ఎదురుగా అతివేగంతో ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వస్తున్న డ్రైవర్ మంగలిబాబు మోటారు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శాబొద్దీన్ తలకు, ఎడమ వైపు కాలుకు తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. శాబొద్దీన్‌కి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహనికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు మహమ్మద్ చాంద్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు.

మద్యం తాగి బైక్‌తో ఢీకొనగా..


కొత్తపల్లి శ్రీహరి మృతదేహం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన ఒకరు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. పొన్నాలకు చెందిన కొత్తపల్లి శ్రీహరి(40) నర్సాపూర్ గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లడానికి, పొన్నాల స్టేజి వద్ద రాజీవ్ రహదారిని దాటి రాఘవేంద్ర హోటల్ వైపు నడుచుకుంటూ వెళుతుండగా సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న దుద్దెడ మదిర సేలంపు గ్రామానికి చెందిన చిలుముల రమేష్ మద్యం తాగి అజాగ్రత్తతో బైక్‌ను నడుపుతూ శ్రీహరిని ఢీకొన్నాడు. దీంతో అతడు కింద పడగా, బలమైన గాయాలు అయ్యాయి. శ్రీహరిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శ్రీహరి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గజ్వేల్‌లో బైక్ ఢీకొని వృద్ధుడు..

గజ్వేల్ రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన ఘటన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగుపల్లికి చెందిన బడే ఎల్లయ్య(78) ఓ కాంట్రాక్ట్ దగ్గర పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం పట్టణంలోని డివైడర్‌పై మొక్కలకు నీళ్లు పట్టేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చేగుంట నుంచి గజ్వేల్‌కు బైక్‌పై గుమ్మడి జైపాల్.. నడుచుకుంటూ వెళ్తున్న ఎల్లయ్యను ఢీకొట్టగా, అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వల్లూరులో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి..

చేగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వల్లూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. నార్సింగి ఎస్సై అహ్మద్ మోహినోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ బాలనగర్ రాజు కాలనికి చెందిన జంగపల్లి పాండురంగ చారి (55) సొంత పనిపై నార్సింగి మండల కేంద్రానికి మంగళవారం ఉదయం వచ్చాడు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ కు వెళ్తున్నానని బయలుదేరాడని వల్లూర్ శివారులో అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని పాండురంగచారి మృతి చెందారు. డ్యూటీలో ఉన్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి అనుకొని శవాన్ని రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య చంద్రకళ తన భర్త పాండురంగ చారి అని గుర్తించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామచంద్రాపురం పీఎస్ పరిధిలో..

రామచంద్రాపురం, డిసెంబరు 11 : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం... రామచంద్రాపురం పట్టణానికి చెందిన రమేష్(25) అతని మిత్రుడు ధన్‌రాజ్ బుధవారం బైక్‌పై లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్నారు. పట్టణంలోని నాగులమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే బైక్ అదుపుతప్పి కిందపడగా.. రమేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, ధన్‌రాజ్‌కు గాయాలయ్యాయి. రమేశ్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించామని ఎస్ఐ పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి


రేవంత్(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువకుడు నీటిగుంతలో పడి మృతిచెందిన సంఘటన హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో చోటచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్లపల్లికి చెందిన రంగు రేవంత్(17) మంగళవారం తన తండ్రి సంపత్, తల్లి సరోజనతో కలిసి వ్యవసాయ బావి వద్దకు పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం పనులు ముగించుకుని ముందుగా రేవంత్ తల్లితండ్రి ఇంటికి తిరిగి వెళ్లారు. రాత్రయినా రేవంత్ ఇంటికి రాకపోవడంతో రాత్రంతా తల్లితండ్రులు అతడి కోసం వెతకగా, ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళుతుండగా.. దారిలోని నీటిగుంతలో పడి శవమై కనిపించాడు. రేవంత్ మృతదేహం వద్ద తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. రేవంత్‌కు ఈత రాకపోవడంతోనే నీటి గుంతలో మునిగి ప్రాణాలు వదిలుంటాడని అనుమానిస్తున్నారు.

తల్లీకొడుకు అదృశ్యం


కుమారుడు అశ్రుబీదాస్‌తో రాణికుమారి(ఫైల్)

రామచంద్రాపురం, డిసెంబరు 11 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లీకొడుకులు అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ సురేశ్ కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గోపన్‌దాస్ తన భార్య రాణికుమారితో కలిసి మై హోం నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నాడు. పది రోజుల క్రితం తన భార్య, 4 సంవత్సరాల కుమారుడు అశ్రుబీదాస్ ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అదే రోజు పనులు ముగించుకుని వచ్చిన గోపన్‌దాస్ తన భార్య గురించి ఇరుగుపొరుగు వారిని విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో స్వరాష్ట్రానికి ఏమైనా వెళ్లి ఉంటుందోనన్న ఆలోచనతో అలాగే ఒంటరిగా ఉండిపోయాడు. పది రోజులైన భార్య, కొడుకు రాకపోవడంతో బుధవారం కొల్లూరు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తొగుట మండలం ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణలో విద్యార్థినులు

కరాటే శిక్షణ.. బాలికలకు ఆత్మరక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా..

మూడు నెలల పాటు తరగతులు

59 మంది మాస్టర్‌లతో ట్రైనింగ్

తొగుట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థినులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల పాటు.. రోజుకు గంట బాలికలకు ఉచితంగా కరాటేలో శిక్షణనిస్తున్నారు.

ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యం



బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించాం. ఈ ఏడాది 258 పాఠశాలల్లో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించాం. మూడు నెలల పాటు బాలికలకు శిక్షణ ఇప్పించడానికి నిష్ణాతులైన 59 మంది శిక్షకులను నియమించాం. ప్రతి ఏటా ఉచిత శిక్షణ తరగతులను కొనసాగిస్తాం.

- ముక్తేశ్వరి, జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

258 పాఠశాలల్లో ఉచిత శిక్షణ

సిద్దిపేట జిల్లాలోని 203 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 13 ప్రాథమికోన్నత పాఠశాలలు, 22 కస్తూర్బా గాంధీ, 16 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, 4 మోడల్ స్కూల్‌లు కలిపి మొత్తం ఈయేడు 258 పాఠశాలలను అధికారులు ఎంపిక చేసి నవంబరు 20న ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి 20 వరకు శిక్షణ కొనసాగనున్నది. ఉచిత కరాటే శిక్షణ కోసం 59 మంది నిష్ణాతులైన మాస్టర్‌లను ప్రభుత్వం నియమించింది. వారి కోసం ఒక్కో పాఠశాల సర్వశిక్ష అభియాన్ నుంచి రూ.5వేల చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో శిక్షకుడు నాలుగు లేదా ఐదు పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో పాఠశాలలో రోజుకు గంటపాటు శిక్షణ ఇస్తుండటంతో బాలికల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తుంది. శిక్షణలో ఎదుటి వారి నుంచి ఆత్మరక్షణ ఎలా పొందాలో శిక్షకులు బాలికలకు మెలకువలు నేర్పిస్తున్నారు. దాంతో బాలికలు శిక్షణలో ఉత్సాహంగా పాల్గొని తమను తాము ఎలా రక్షించుకోవాలో నేర్చుకుంటున్నారు.

ఆత్మరక్షణకు దోహదం



కరాటే నేర్చుకోవడం మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. శిక్షణలో నేర్చుకుంటున్న మెలకువలు మాకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రతీ బాలిక కరాటే నేర్చుకొని ఆత్మ నిబ్బరంతో ముందుకు సాగాలి

- వర్షిణి, 9వ తరగతి, ఎల్లారెడ్డిపేట

విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అందిస్తున్న ఆత్మరక్షణ విద్య చాలా ఉపయోగకరంగా ఉంది. మేము బయటకు వెళ్లినపుడు ఎవరి వల్లనైనా ఇబ్బంది ఎదురైతే.. మమ్మల్ని మేము ఎలా రక్షించుకోవాలో నేర్పిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలి.

- లిహారిక పదో తరగతి, ఘనపూర్

ప్రభుత్వ ప్రోత్సాహం మరువలేనిది



కరాటే శిక్షణ తరగతుల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శిక్షణలో విద్యార్థులు వారిని వారు ఏవిధంగా రక్షించుకోవాలో మెలకువలు నేర్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ తరగతులు పెట్టి, ఉపాధి చూపించి ప్రోత్సహించడం మరువలేనిది.

- చీకోటి సుధాకర్, కరాటే మాస్టర్

ఎల్‌సీడీసీ ప్రోగ్రాంను పరిశీలించిన కేంద్ర వైద్య బృందం


పీహెచ్‌సీ వద్ద కేంద్ర వైద్య బృందం

మనోహరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య బృందం 2 నుంచి 15వ తేదీ వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను నిర్వహిస్తున్నది. బుధవారం కేంద్ర వైద్య బృందం మండలంలోని గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఎల్‌సీడీసీ ప్రోగ్రాంను పరిశీలించారు. శరీరం మీద స్పర్శ, గోదుమ రంగు మచ్చలు, ఇతర ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో వారు మాట్లాడుతూ బహు ఔషధ చికిత్స ద్వారా కుష్ఠు వ్యాధిని నిర్మూలించవచ్చని తెలిపారు. అలాగే తూప్రాన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్‌రావును తగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు హరికృష్ణ, బాలక్రిష్ణ, జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు, శ్రీనివాస్, వెంకటరమణ, వైద్య అధికారి, సమత, బాలనర్సయ్య, సంతోష్ కుమార్, సూపర్‌వైజర్లు, కృష్ణ, శారద, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- ఎవరూ ఆందోళన చెందొద్దు
- ఎవరికి నయా పైసా ఇయ్యొద్దు
- డబ్బు అడిగితే కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేయండి
- కాంగ్రెస్ కిసాన్ సెల్ సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ మాసిన వెంకట్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింప చేసేలా కృషి చేస్తామని కాంగ్రెస్ కిసాన్ సెల్ సిద్దిపేట జిల్లా సెక్రెటరీ మాసిన వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు గూడు కల్పించాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇల్లు పథకం తీసుకొచ్చిందని చెప్పారు. ప్రజలకు ఇంత మంచి పథకాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్వే అన్ని గ్రామాల్లో జరుగుతుందని, అర్హులైన వారు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు పుకార్లు నమ్మవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి సూచన మేరకు అర్హులను గుర్తిస్తుందన్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు రాదేమో అని అపోహ పెట్టుకోవద్దని భరోసా కల్పించారు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఎవరైనా వచ్చి డబ్బు అడిగితే ఇవ్వవద్దని, అలాంటి వారిపై గుర్రాలగొందిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కానీ, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఎర్ర హరీశ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నారాయణఖేడ్‌లో కూరగాయలను విక్రయిస్తున్న నిర్మల

చదువంటే ఇష్టం.. బతుకేమో భారం

కుటుంబపోషణకు కూరగాయలు అమ్ముతున్న ఇంటర్ విద్యార్థి

ఎంబీబీఎస్ చదవడమే లక్ష్యంగా కష్టపడుతున్న గిరిపుత్రిక

నారాయణఖేడ్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు కుటుంబ పోషణ కోసం పడుతున్న బాధలు చూడలేక ఒకవైపు కూరగాయల వ్యాపారం చేస్తూనే మరోవైపు ఇంటర్మీడియట్ చదువుతున్నది సంగారెడ్డిజిల్లా నారాయణఖేడ్ మండలం కొండాపూర్ శివార్‌సందు తండాకు చెందిన నిర్మల. స్వశక్తితో తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తూ, ఎంబీబీఎస్ పూర్తి చేయడమే లక్ష్యంగా చదువుతున్నది.

శివార్‌సందు తండాకు చెందిన వడితే చందర్, చంగ్లిబాయికి ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వారికి ఎకరం భూమి ఉండగా, ఆరుగురు పిల్లలను పోషించడం వారికి కష్టంగా మారింది. ఉన్న ఎకరం భూమితోనే కష్టపడి పెద్ద కుమార్తె లత, రెండో కుమార్తె భూలీల వివాహాలు జరిపించారు. మూడో కూతురు బుజ్జి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటుంది. నాల్గో కుమార్తె నిర్మల, ఐదో కుమార్తె వైశాలి చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కుటుంబపోషణకు, అక్కల వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చడానికి పడుతున్న గోసను చూసిన నిర్మల పదో తరగతి పూర్తయ్యాక ఏదోఒక పని చేస్తూనే చదువుకోవాలని భావించింది. నిర్మల ప్రాథమిక విద్యను కొండాపూర్‌లోనే పూర్తి చేయాగా, పదో తరగతి వరకు సిద్దిపేటలోని గురుకుల పాఠశాలలో చదివింది. టెన్త్‌లో 9.0 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో నారాయణఖేడ్ పట్టణంలోని పొట్టిశ్రీరాములు చౌక్ సమీపంలో కూరగాయల దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంది. ఒకవైపు కూరగాయల దుకాణం నడుపుతూనే, ఖేడ్ ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీలో చేరింది. కూరగాయల దుకాణం నడుపుతూ చదవడం కష్టతరంగా మారడంతో మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టు తప్పింది. అయినప్పటికీ ఛాలెంజ్‌గా తీసుకుని రెండో సంవత్సరంలో మంచి మార్కులు తెచ్చుకుని.. ర్యాంకు సాధించి, ఎంబీబీఎస్ సీటు దక్కించుకోవడమే లక్ష్యంగా చదువుతున్నది. తెల్లవారుజామున 4 గంటలకు కూరగాయల మార్కెట్‌కు వచ్చి హోల్‌సేల్‌లో కూరగాయలను కొనుగోలు చేసి, 6 గంటల వరకు దుకాణం సిద్ధం చేసుకుంటుంది. తన సోదరి వైశాలి నిర్మల దుకాణానికి సాయపడుతుంది. ఉదయం నుంచి రాత్రి వరకు కూరగాయల దుకాణం నడుపుతారు. వ్యాపారం లేని సమయంలో చదువుకుంటారు. కళాశాలకు వెళ్లిన సమయంలో వారి తండ్రి దుకాణం చూసుకుంటాడు. కుటుంబ పరిస్థితులతో ఒకవైపు వ్యాపారం చేస్తూనే.. మరోవైపు తనకు ఇష్టమైన చదువును వదలకుండా కళాశాలకు వెళ్తున్న నిర్మల తన లక్ష్యాన్ని చేరుకోవాలని కోరుకుందాం.

క్రమ శిక్షణతో తరగతులకు హాజరవుతున్నది.




మా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వడిత నిర్మల క్రమశిక్షణ కల అమ్మాయి. తరగతులకు చక్కగా హాజరవుతుంది. పట్టణంలోని ప్రధాన చౌక్‌లో కూరగాయల వ్యాపారం చేస్తూనే చదువుకుంటుంది. ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది.

- రమేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్

ఎంబీబీఎస్ సీటు దక్కించుకోవడమే లక్ష్యం

మా అమ్మానాన్న ఉన్న కొద్దిపాటి భూమిలో కష్టపడి మమ్మల్ని పోషిస్తున్నారు. వారు పడుతున్న బాధలు చూడలేక కూరగాయల వ్యాపారం చేస్తూనే చదువుకుంటున్నా. కష్టంగా ఉన్నప్పటికీ, కుటుంబ పరిస్థితుల వల్ల తప్పడం లేదు. బాగా చదువుకుని ఎంబీబీఎస్ సీటు దక్కించుకుంటా. అదే నా లక్ష్యం.

- నిర్మల, విద్యార్థిని



జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ముంబయిలో నిర్వహించిన జాతీయ స్థాయి రంగోత్సవ్ చిత్రలేఖన పోటీల్లో సత్తాచాటి బంగారు, కాంస్య పతకాలను పొందినట్లు ప్రిన్సిపాల్ బి.శ్యామలత తెలిపారు. విద్యార్థుల్లో 11 మంది బంగారు పతకాలను, 8 మంది కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు. మరో ఆరుగురు విద్యార్థులు వెండి పతకాలు పొందగా, ఒకరు కన్సోలేషన్ బహుమతిని సాధించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యామలత రిమార్కేబల్ కాంట్రిబూషన్ ఇన్ ఆర్ట్ అండ్ ఎడ్యుకేషన్ అవార్డుకు, ఆర్ట్ టీచర్ జె.దినేష్‌కుమార్ కళావిభూషణ్ అవార్డుకు ఎంపికయ్యారు.

వాహనం టైర్లు చోరీ

కౌడిపల్లి , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌కు ఎదురుగా నిలిపి ఉన్న వాహనం వెనుక టైర్లను గుర్తుతెలియని దుండగులు దొంగలించిన సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పండ్ల వ్యాపారి పట్నం ఆంజనేయులు ఐదేళ్లుగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ షాపును అద్దెకు తీసుకుని పండ్లు విక్రయిస్తున్నారు. ఇదే క్రమంలో తన పండ్లను తీసుకొచ్చే వాహనాన్ని (బొలెరో) షాపు ఎదుట మంగళవారం రాత్రి నిలిపి ఉంచి ఇంటికి వెళ్లిపోయాడు మరుసటి రోజు బుధవారం తెల్లవారుజామున చూసేసరికి వాహనం వెనుకవైపు ఉన్న రెండు టైర్లతో పాటు అదనంగా ఉన్న డెక్స్‌ను సైతం చోరీకి గురయ్యాయి. పట్నం ఆంజనేయులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దొంగతనానికి గురైన వాహనం వెనుక టైర్లు

రేపు పటాన్‌చెరులో విద్యుత్ గ్రీవెన్స్‌డే

పటాన్‌చెరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పటాన్‌చెరు విద్యుత్ ఉపకేంద్రంలో ఈ నెల 13వ తేదీన సీజీఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం)హైదరాబాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పటాన్‌చెరు ఏడీఏ సంజీవ్ పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే గ్రీవెన్స్ డేలో పాల్గొని సమస్యలు తెలియజేస్తే తక్షణం పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారులు ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు రసీదు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. పటాన్‌చెరు, పటాన్‌చెరు రూరల్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడల్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

నారాయణఖేడ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న జి.నారాయణకు ప్రఖ్యాత జగదీష్ ప్రసాద్ జబర్మల్ టిబ్రేవాల యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'రాష్ట్రంలో సూక్ష్మ విత్తం పనితీరు - సంగారెడ్డి జిల్లాపై సమీక్ష' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టరేట్‌కు పొందిన నారాయణను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు సహచర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

రోడ్లు ఇలా.. పల్లెకు చేరేదెలా?

- జహీరాబాద్ నియోజకవర్గంలో అధ్వానంగా గ్రామీణ రహదారులు
- సమీప గ్రామాలకు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే
- విన్నవించినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు




గుడిపల్లి-ధనసిరి గ్రామాల లింక్ రోడ్డు, పాడైపోయిన బూచనెల్లి-తూంకుంట రోడ్డు

జహీరాబాద్ డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గంలో ఆయా గ్రామాలను అనుసంధానం చేస్తు గతంలో వేసిన లింక్‌రోడ్ల అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. లింక్‌రోడ్లను అభివృద్ధి చేస్తే దూరభారం, వ్యయప్రయాసాలు తగ్గుతాయని జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాలప్రజలు కోరుతున్నారు. లింక్‌రోడ్లు సక్రమంగా లేకపోవడంతో సమీపంలోని గ్రామాలకు వెళ్లాలంటే ప్రధాన రోడ్ల గుండా చుట్టూ తిరిగి వెళ్లాల్సివస్తున్నదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జహీరాబాద్ మండలంలో లింక్‌రోడ్డు ఇలా..

జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి-తూంకుంట గ్రామాలకు మధ్యలో గల లింక్ రోడ్డుద్వారా వెళ్తే 4కిలోమీటర్లు ఉండగా, చుట్టుతిరిగి వెళ్లాలంటే 8 కిలోమీటర్లు, బూడ్డిపాడ్- బూచనెల్లి గ్రామాల మధ్య దూరం 4కిలోమీటర్లు ఉండగా, 9కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సివస్తున్నది. అలాగే ఆనెగుంట నుంచి మల్‌చెల్మ గ్రామాల మధ్యలో గల లింక్ రోడ్డు ద్వారా వెళ్తే.. 5కిలోమీటర్ల దూరం ఉండగా, చుట్టూ తిరిగి వెళ్లడం వల్ల 12కిలోమీటర్ల దూరం ఉంది.

మొగుడంపల్లి మండలంలో..

మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లి నుంచి ధనసిరి రోడ్డుకు వెళ్లాలంటే 3కిలోమీటర్ల దూరం ఉండగా చుట్టుతిరిగి వెళ్లాలంటే 10కిలో మీటర్ల దూరం ఉంటుంది. అలాగే రేజింతల్-హద్నూర్ గ్రామాల మధ్య దూరం 4కిలోమీటర్లుండగా ప్రధాన రోడ్డు గుండా వెళ్తే 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

నిధులు మంజూరు చేయాలి

నియోజకవర్గంలో ప్రతీ గ్రామం నుంచి మరో గ్రామానికి (పానాదులు)లింక్ రోడ్లు ఉన్నాయి. అయితే లింక్‌రోడ్లను అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు సమీప గ్రామాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. లింక్‌రోడ్లను అభివృద్ధి చేయాలని పలు మార్లు అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయాగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి లింక్‌రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి




సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు, పటాన్‌చెరు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు/నారాయణఖేడ్/చిన్నశంకరంపేట/రామాయంపేట/నర్సాపూర్/మెదక్ అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో వార్త కవరేజికి వెళ్లిన జర్నలిస్టులపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్ బాబు అతడి అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ జర్నలిస్టుల సంఘాల డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా బుధవారం సంగారెడ్డి, మెదక్‌జిల్లాల్లోని పలు మండలాల్లో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియాను నియంత్రించే హక్కు. దాడి చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బుధవారం జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. పటాన్‌చెరు జాతీయ రహదారిపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి, రాస్తారోకో నిర్వహించారు. తక్షణం మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. నారాయణఖేడ్‌లో జర్నలిస్టుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జర్నలిస్టులపై దాడికిపాల్పడిన మోహన్ బాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో అశోక చక్రవర్తికి జర్నలిస్టులు వినతి పత్రం అందించారు. చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా జాయింట్ సెక్రెటరీ అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. మోహన్ బాబు దాడిని నిరసిస్తూ రామాయంపేటలోని మెదక్ చౌరస్తాలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకునేలా చూడాలని కోరుతూ నర్సాపూర్ మీడియా ప్రతినిధులు ఆర్డీవో మహిపాల్‌కు వినతి పత్రం అందచేశారు.

మెదక్ కలెక్టరేట్ ఎదుట టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్‌దయాళ్‌చారి ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి



మొర్గి చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

నాగల్‌గిద్ద, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):'ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 9న ప్రచురితమైన ఎస్పీ ఎస్పీ చెన్నూరి రూపేష్ స్పందించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని మొర్గి క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్మాణంలో ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట నారాయణఖేడ్ డీఎస్పీవెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ సాయిలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కేతకీ ఆలయ ఈవోగా శివరుద్రప్ప

ఝరాసంగం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయ ఈవోగా శివరుద్రప్పను నియమిస్తునట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గత కొన్ని నెలలుగా ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన శశిధర్ గుప్తా తిరిగి బోంతపల్లి ఆలయానికి వెళ్లనున్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడం కూల్చివేత

జిన్నారం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లిలో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బుధవారం కాజీపల్లి 181 సర్వే నెంబరులో ఓ వ్యక్తి చేపట్టిన అక్రమ కట్టడాన్ని ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి

మెదక్ అర్బన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనం, వంటగది, స్టోర్‌రూం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినులతో ముఖాముఖా నిర్వహిం పలు సూచనలు చేశారు. వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని వార్డెన్‌ను ఆదేశించారు.

కుటుంబ గొడవలతో యువకుడు అదృశ్యం



శ్రీకాంత్

చేగుంట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవ పడిన యువకుడు ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యం అయిన సంఘటన మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన నాగారం శ్రీకాంత్‌కు ఉమ్మడి మండలంలోని పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. తరచూ కుటుంబగొడవల కారణంగా దంపతుల మధ్య అభిప్రాయబేధాలు ఏర్పడ్డాయి. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నట్టు చెప్పి ఇంటి నుంచి బైక్‌పై వెళ్లిన శ్రీకాంత్ తిరిగి రాకపోవడంతో గాలించినా ఫలితం లేకపోయింది. తల్లి శివ్వమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గణిత నవరత్న ఆణిముత్యాలు: ట్రైనీ కలెక్టర్



విజేతలతో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్/జిన్నారం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గణిత నవరత్న ఆణిముత్యాలు జిల్లా విద్యార్థులని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో తెలంగాణ గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ట్రైనీ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో సరైన మార్గంలో వెళ్తే.. జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలిపారు. అనంతరం గణిత ప్రతిభ పరీక్ష రాష్ట్ర స్థాయి విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, టీఎంఎఫ్ మాజీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, ఆర్థిక కార్యదర్శి పుణ్యానాయక్, విద్యా శాఖ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా బొల్లారం మోడల్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి మోహన్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. మోహన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రిజర్వాయర్ల పనులు త్వరగా పూర్తి చేయాలి



జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబరు, 11(ఆంధ్రజ్యోతి): జలమండలి ఆధ్వర్యంలో ఓఆర్ఆర్ ఫేజ్-2 పరిధిలో కొనసాగుతున్న రిజర్వాయర్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి నగర శివారు ప్రాంతంలోని ప్రతీ ఇంటికి మంచినీటిని అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. బుధవారం జలమండలి అధికారులతో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. బొల్లారం, అమీన్‌పూర్, బీరంగూడా, తెల్లాపూర్ తదితర పట్టణాలలో రిజర్వాయర్ల నిర్మాణం తుదిదశకు చేరుకున్నాయని అధికారులు పేర్కొన్నారు. పనులు నత్తనడకన నడుస్తున్నాయని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో 15రోజుల్లో పంపింగ్ పనులు సైతం పూర్తి చేసి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. కాలుష్య జలాలతో ఇబ్బందులు పడుతున్న బొల్లారం మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జలమండలి జీఎం సుబ్బారాయుడు, డీజీఎంలు చంద్రశేఖర్, శివకుమార్, ఏఈలు ప్రవీణ్, పూర్ణేశ్వరి, శ్రీనివాస్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి ఏఈని సస్పెండ్ చేయాలి



తూప్రాన్ విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టిజన్లు

తూప్రాన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోల్ టు పోల్(ఆర్టిజన్4) నర్సింలు నాయక్‌పై దాడి చేసిన వెల్దుర్తి ఏఈ పెంటానాయక్‌ను సస్పెండ్ చేయాలని టీఎస్‌యూఈఈయూ(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ. మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీఎస్‌యూఈఈయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు నర్సింలు, రవీంద్రప్రసాద్‌లతో తూప్రాన్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఆర్టిజన్ నర్సింలునాయక్ నుంచి ఏఈ పెంటానాయక్ అకారణంగా దాడి చేసి గాయపరిచినట్లు పేర్కొన్నారు. మరునాడు డీఈకి వినతిపత్రం అందజేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో సురేష్, రమేష్, రాజిరెడ్డి, పాసి, అశోక్, సలీం, సత్తిబాబు, సూరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దత్త జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

ఝరాసంగం/హత్నూర, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బర్దీపూర్‌లో గల దత్తగిరి ఆశ్రమంలో ఈ నెల 13 నుంచి 17 వరకు జరిగే దత్త జయంతి వేడుకలకు ఆశ్రమం విద్యుత్ దీపాలతో ముస్తాబైంది. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవధూత గిరి మహారాజ్, భావి పీఠాధిపతి డాక్టర్ సిద్దయ్య స్వామి అన్ని ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ డిపో నుంచి ఆశ్రమానికి ఆర్టీసీ బస్సులు కొనసాగనున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా హత్నూర మండల పరిధిలోని మాదుర గ్రామ శివారులో గల దత్తాచల క్షేత్రంలో జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల సమక్షంలో యాగశాల ప్రవేశం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలు మండలాల్లో ఘనంగా గీతాజయంతి



రామాయంపేట గీతాభవన్‌లో ప్రవచనం చేస్తున్న కృష్ణానంద స్వామి

నారాయణఖేడ్/రామాయంపేట/తూప్రాన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో గీతా జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణలోని సాయిబాబా ఆలయం ఆవరణలో లలితా వైభవం ట్రస్టు వ్యవస్థాపకులు మలమంచి మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో గీత యజ్ఞం పారాయణం, కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని విజ్ఞాన్‌పాఠశాలలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో గీత జయంతి సందర్భంగా విద్యార్థులకు గీతపుస్తకాలను పంపిణీ చేసి, భగవత్ గీత ప్రాముఖ్యతను వివరించారు. మెదక్ జిల్లా రామయంపేటలో గీతా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువ జామున నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా టేక్రియాల కృష్ణానంద ఆశ్రమ పీఠాధిపతి కృష్ణానంద స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరిస్తూ సమత్వ భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. తూప్రాన్ పట్టణంలోని గీతామందిరంలో బుధవారం 42వ గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు గీతా జయంతిని పురస్కరించుకొని గణపతిపూజ, పంచామృత మహాభిషేకం, భగవద్గీత పారాయణం, హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.

14న కురుమ సంఘం భవన ప్రారంభోత్సం



పోతిరెడ్డిపల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న కురుమ సంఘం నాయకులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈ నెల 14న గొల్ల కురుమ సంఘం నూతన భవన ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా నుంచి భారీగా తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్‌యాదవ్, ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు తెలిపారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని ఓ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి విశిష్ట అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇతర ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో కురుమ సంఘం నాయకులు పోచారం రాములు, జూలకంటి అంజనేయులు, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీకి హరీశ్‌రావు పరామర్శ



సంగారెడ్డిలో సత్యనారాయణను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు ఆర్. సత్యనారాయణను సంగారెడ్డిలోని ఆయన నివాసంలో బుధవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. సత్యనారాయణ యోగక్షేమాల గురించి వైద్యులు అందిస్తున్న చికిత్స గురించి ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మామిళ్ల రాజేందర్, మాజీ జడ్పీటీసీ మనోహర్‌గౌడ్ తదితరులు ఉన్నారు. అనంతరం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి హరీశ్‌రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

'పొగాకు వినియోగం మనిషి మనుగడకే ప్రమాదం'

పుల్‌కల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):పొగాకు వినియోగంతో మనిషి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని నియంత్రణ విభాగం జిల్లా పర్యవేక్షకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా, సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతం, శివంపేట, చౌటకూర్ బస్టాండ్ కూడలి తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు మనిషి ప్రాణాలకు అత్యంత ప్రమాదకరమని వివరించారు. బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరమని అందుకు రూ.200 జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీజేసీని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలపాలి

మునిపల్లి, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లాలోనే మొదటి స్థానంలో నిలపాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ సంగారెడ్డి జిల్లా ఆఫీసర్ గోవింద రామ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం బుదేరా జీజేసీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు అధ్యాపకబృందంతో సమావేశమై పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ముద్దం సిద్దారెడ్డి, సుధాకర్, మారుతి, ఉదయ్ ప్రసాద్, కాటి అబ్బయ్య, రమేష్, సంజయ్, రవి, రవికుమార్, సాయిబాబా, వడ్ల రాచన్న, లైబ్రేరియన్ మన్నె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సీఎం కప్ క్రీడాపోటీలు






సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు, జిన్నారంలో పోటీలు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ రోజారాణి, మనోహరాబాద్: ఖోఖోలో గెలిచిన రంగాయపల్లి జట్టు

సంగారెడ్డి అర్బన్/జిన్నారం/మునిపల్లి/హత్నూర/కోహీర్/రామాయంపేట/చిలప్‌చెడ్/వెల్దుర్తి/మనోహరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : సీఎంకప్ మండలస్థాయి క్రీడాపోటీలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో సందడిగా సాగుతున్నాయి. బుధవారం సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన క్రీడల్లో మున్సిపాలిటీ పరిధితో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీపడ్డారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఖాసీంబేగ్ పర్యవేక్షణలో క్రీడలు జరిగాయి. బొల్లారం మున్సిపాలిటీలో సీఎంకప్ క్రీడాపోటీలను మోడల్ పాఠశాల ఆవరణలో చైర్‌పర్సన్ రోజారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, కమిషనర్ మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు. మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాలలో బుధవారం రెండోరోజు నిర్వహించిన క్రీడాపోటీల్లో ఖోఖో మహిళా విభాగంలో కంకోల్ ప్రథమ స్థానం, ఖమ్మంపల్లి ద్వితీయ, లోనికలాన్ తృతీయ స్థానం సాధించాయి. పురుషుల విభాగంలో లింగంపల్లి, మునిపల్లి, ఖమ్మంపల్లి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ అండర్ 18బాలుర విభాగంలో మునిపల్లి, కంకోల్, ఖమ్మంపల్లి ప్రథమ స్థానాల్లో నిలిచాయని పీడీ కర్ణాకర్ రెడ్డి తెలిపారు.

హత్నూర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాల ఆవరణలో రెండోరోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సీఎం కప్ క్రీడాపోటీలను సద్వినియోగంచేసుకోవాలన్నారు. కోహీర్‌లోని లాలకుంట ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాలీబాల్, కబడ్డీ, తదితర క్రీడా పోటీలను నిర్వహించారు. గురువారం అథ్లెటిక్స్ కో-కో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో భారతి పేర్కొన్నారు. మెదక్ జిల్లా రామాయంపేటలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో రెండో రోజు కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహించారు. పోటీల్లో ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన బాలికల జట్టు కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది.

చిలప్‌చెడ్ మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో పలువురు అధికారులు సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. అధికారులు కబడ్డీ, ఖోఖో వాలీబాల్ తదితర ఆటలను ఆడి పోటీలను ప్రారంభించారు. వెల్దుర్తిలో రెండో రోజు సీఎం కప్ మండల స్థాయి క్రీడలు కొనసాగినట్టు ఎంపీవో విఘ్నేశ్వర్ తెలిపారు. మనోహరాబాద్ మండలంలోని జేఎంజే పాఠశాలలో సీఎంకప్ క్రీడల్లో భాగంగా రెండోరోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కబడ్డీ , వాలీబాల్ ఫైనల్లో మనోహరాబాద్ టీంలు విజేతగా నిలిచాయి. అలాగే ఖోఖోలో రంగాయపల్లి జట్టు విజేతగా నిలిచింది.

PUBLIC NOTICE

The General Public is hereby inform that **Sri Lingannagari Shiva Reddy, S/o. Jogi Reddy,** AGE 26 YEARS, OCCUPATION: BUSINESS, R/o. H No. 2-73, Mallepally Village, Kondapur Mandal, Sangareddy District, TELANGANA STATE,. My Client M/s SHRIRAM FINANCE LTD SANGAREDDY Branch, Sanga Reddy Dist with a Requesting to advance of Loan by Mortgaging his Property.

DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that the House bearing Door No.5-86 admeasuring 107.0 Sq.yards with the Ground floor and First floor builtup area of 963.20 Sq.feets each situated at Mallepally Village of Kondapur Mandal, Sangareddy District, Telangana State, **Bounded by:- North:** 15 feet wide road, **South:** 15 feet wide Road, **East:** 60 feet wide road, **West:** House of Police Kista Reddy and others.

Institution if having objections, Claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date of publication please take notice that if no objection claims are received within period prescribed above. My client will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/-**Aravind Kulkarani,** Advocate,
Sangareddy
8639166516

PUBLIC NOTICE

The General Public is hereby inform that Sri.Shivanapuram Padma Rao, S/o. Samuyulu, AGE 44 YEARS, OCCUPATION: BUSINESS, R/o. H.No.1-23, Rudraram Village, Patancheru Mandal Sangareddy District, TELANGANA STATE,. My Client M/s SHRIRAM FINANCE LTD SANGAREDDY Branch. Sanga Reddy Dist with a Requesting to advance of Loan by Mortgaging his Property.

DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All That The Open Place In Survey No.1002, (H No.10-26/A1/48)in Total Admeasuring 181.5 Sq. Yards Situated At Rudraram Village, Patancheru Mandal,Sangareddy District, Telangana State. Bounded by :-**North**:- 30' Wide G.P Road. **South**:- Land Of K.Yellaiah. **East** : Open Place of S.Anand. **West**:- Open Place of Prakash

Institution if having objections, Claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersingh with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (3) days from the date of publication please take notice that if no objection claims are received within period prescribed above. My client will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objection disputes will be entertained. Open Place of

Sd/- Aravind Kulkarani, Advocate
Sangareddy, 8639166516